ఆ మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

- హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయని వైనం
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు


ఎన్నార్పీ అగ్రహారంలో జాతీయ రహదారిపై ప్రమాదకరంగా మారిన మలుపు


ఉండి సెంటర్‌లో గణపవరం రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

ఉండి: జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులపై ఉన్న మలుపులు అనేక మంది జీవితాలను మలుపు తిప్పేస్తున్నాయి. కొందరు అనాథలైతే మరికొందరు అవయువాలు కోల్పోయి జీవిత కాలం శిక్షను అనుభవిస్తున్నారు. రోడ్ల ప్రారంభ దశలో ఏర్పడిన మలుపులనే జాతీయ రహదారి, రాష్ట్ర రహదారుల్లో అదే విధంగా ఉపయోగించి రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ మలుపుల్లో అనేక మంది వాహనదారులు, స్థానిక ప్రజల జీవితాలు ప్రమాదాలకు గురవుతున్నా అధికారుల పర్యవేక్షణ శూన్యమని వాహనాదారులు వాపోతున్నారు. ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్‌చర్చ్ సమీపంలో జాతీయ రహదారి 165పై ఉండే ఓ మలుపులో ఎన్నో జీవితాలు తెల్లారిపోయాయి. అతి భయంకరమైన ప్రమాదాలు జరిగి ఎంతో మంది చనిపోయినా ఆ మలుపుకు మరమ్మతులు చేసి కనీసం కొత మేర అయినా మలుపును తగ్గించే ప్రయత్నాలు చేయకపోవడం గమనార్హం. రోడ్డు మలుపును సరిచేసేందుకు అక్కడ సరిపోయేంత స్థలం కూడా ఉంది. అయితే ఎప్పుడైనా రోడ్డు మరమ్మతులు చేసినా, రోడ్డు వేసినా అధికారుల పర్యవేక్షణ కొరవడంతో అదే ప్రాంతంలో అదే విధంగా రోడ్డు వేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది భారీ వాహనాలు,స్కూలు బస్సులు, ద్విచక్రవాహనాలు, ప్యాసింజర్ అటోలు,కార్లు వంటివి లెక్కకు మించి ప్రయాణాలు సాగిస్తుంటాయి. రహదారులపై ఎక్కడ ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగినా స్పందించి పరిష్కరించాల్సిన అధికారులు కన్నెత్తి కూడా వాటిని చూడకపోవడం బాధాకరమని వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు.

ఉండి సెంటర్‌లో పరిస్థితి ఇదీ

ఉండి సెంటర్‌లో గణపవరం వెళ్ళే రాష్ట్ర రహదారిలో రెండు కాలువల వద్ద ఇరిగేషన్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న మలుపు కూడా ఎంతో ప్రమాదకరంగా మారింది. ఏళ్ల తరబడి జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు అక్కడ రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. నిత్యం వాహనదారులు, స్థానికులతో ఆ మలుపు కిటకిటలాడుతుంది. అదే విధంగా మద్యం దుకాణం కూడా అదే ప్రాంతంలో ఉండడంతో మందుబాబుల హడావు చాలా వరకు ఎక్కువగా ఉంది. దీంతో ఆ ప్రాంతంలో కూడా ప్రమాదాలు మరింతగా పెరిగిపోయాయి. ఓ చిన్న వంతెన కడితే మలుపు మాయం అవుతుంది. అయినా అధికారుల్లో చలనం లేకపోవడంతో ప్రయాణికులు, వాహనదారుల జీవితాలు గాల్లో దీపంలో మారిపోయాయి.

ప్రమాదకరమైన మలుపులు ఇవే

- **ఉండి మండలం:** చెరుకువాడ రైస్ మిల్లు వద్ద, యండగండి లాకుల వద్ద, కోలమూరు మంచి నీటి చెరువు వద్ద.
- **ఆకివీడు మండలం:** ఆకివీడు సెంటర్‌లో ఎస్ టర్నింగ్, కుప్పనపూడి టర్నింగ్, ఐ భీమవరం టర్నింగ్‌లు.
- **కాళ్ల మండలం:** కాళ్లకూరు పూజారుల వంతెన వద్ద, ఏలూరుపాడు ఉప్పుటేరు వైపు, కాళ్ల గ్రామంలో ఎస్ టర్నింగ్.
- **పాలకోడేరు మండలం:** గరగపర్రు, పాలకోడేరు, గొరగనమూడి గ్రామాల్లోని మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

మా మేనత్త చనిపోయింది



ఎన్నార్పీ అగ్రహారంలో రోడ్డుపై ఉన్న మలుపులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మా మేనత్తను కోల్పోయాం. తల్లిలా మాకు తోడుగా ఉండే ఆమె కోల్పోయినప్పటి నుండి మాకు చాలా లోటుగా ఉంది. ఎంతో ప్రమాదకరంగా ఉన్న ఆ మలుపును సరిచేసే అవకాశం ఉన్నా అధికారులు ఎందుకు సరిచేయడం లేదో? అర్థం కావడం లేదు.ఇప్పుడైన చేసే చాలా ఎన్నో ప్రాణాలు కాపాడినట్టే.

– గుమ్మడి అమృతరావు,ఎన్నార్పీ అగ్రహారం

ఆక్రమణలు తొలగించాలి



రోడ్డు మలుపుల్లో ఉండే ఆక్రమణలు, బ్యానర్‌లు తలొగిస్తే కొంతమేర ప్రమాదాలు అరికట్ట వచ్చు. అయితే అధికారుల తీరు అందుకు భిన్నంగా ఉంది. రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే అది హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులది భాధ్యత కాదా? వారు కనీసం ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పర్యవేక్షిస్తే పరిష్కారం లభిస్తుంది

– నిమ్మల కేశవకుమార్, ఎంపీటీసీ సభ్యుడు, ఉప్పులూరు

రోడ్డు ఇలా.. ప్రయాణించేది ఎలా?


భారీ గోతులతో ప్రమాదకరంగా ఉన్న కోలనపల్లి ఆర్అండ్ బీ రహదారి

కాళ్ల: దారి పొడవున గోతులే తప్ప రహదారి ఎక్కడ? అన్న చందంగా ఉంది కోలనపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి పరిస్థితి. అడుగడుగునా భారీ గోతులతో ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా తయారైంది. కాళ్ల నుంచి కోలనపల్లి మీదుగా ఆకివీడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి భారీ గోతులతో అధ్వానంగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాధుడే లేడని వాహనదారులు, ప్రజలు, కోలనపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాళ్ల నుంచి కుప్పనపూడి గ్రామ సరిహద్దు వరకు అడుగడుగునా భారీ గోతులతో ఆర్‌అండ్‌బీ రహదారి ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు వర్షాలు వస్తే భారీ గోతుల్లో నీరు నిలబడి చెరువులను తలపిస్తున్నాయి. ఆ గోతుల్లో ప్రయాణం అంటేనే ప్రయాణికులు వాహనదారులు భయపడుతున్నారు. కనీసం నీరు బయటకు వెళ్లే మార్గం లేక వర్షం లేకపోయినా రోజుల తరబడి భారీ గోతుల్లో నీరు నిలబడటంతో ఎటువైపు వెళ్లాలో? తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రహదారిలో కారులో ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులు మరమ్మతులైనా చేపట్టి భారీ గతంలో వర్షపు నీరు నిలవ లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు ప్రజలు ఇబ్బందులను తీర్చాలని కోరుతున్నారు.

నూతన మద్యం పాలసీతో మహిళలకు ఇబ్బంది


భీమవరం ఆరవ వార్డులో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: నూతన మద్యం విధానం మహిళల తాళిబొట్లు తెంపే విధంగా ఉందని సీపీఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు విమర్శించారు. మంగళవారం ములపర్తి అప్పారావు అధ్యక్షతన జరిగిన పట్టణ 6వ వార్డు శాఖ మహాసభలో వాసుదేవరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూడడం వల్ల నేరాల సంఖ్య గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి నేతలు సిండికేట్లుగా ఏర్పడి మద్యం షాపుల్లో స్థానిక ఎమ్మెల్యేలకు ఒక్కొక్క షాపునకు 20 శాతం వాటాలు అడుగుతున్నట్లు ప్రచారం జరుగుతోందని ఎమ్మెల్యేల జోక్యాన్ని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరవ వార్డులో డ్రైను, రోడ్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి బొక్క సత్యనారాయణ, బి విజయలక్ష్మి, బి శాంతికుమారి, బి చైతన్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ గోదాముల నిర్మాణాల తనిఖీ


గోదాముల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ బ్యాంక్ అధికారులు

ఆకివీడు: నాబార్డు నిధులతో చేపట్టిన గోదాముల నిర్మాణాన్ని మంగళవారం సెంట్రల్ బ్యాంక్ ఇంజినీరింగ్ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనల మేరకు నిర్మాణం జరిగిందీ? లేనిదీ? పరిశీలించి, నిర్మాణంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంక్ డెవలప్‌మెంట్ మేనేజర్ తులసీధర్, డీసీసీబీ మార్కెటింగ్ డీఈ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 23 గోదాముల నిర్మాణానికి నాబార్డు రూ. 44 లక్షలు చొప్పున మంజూరు చేసిందని చెప్పారు. దీనిలో 5 గోదాముల నిర్మాణానికి ఏఆర్‌పీ నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. జిల్లాలో మొత్తం 13 గోదాముల నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. మరో మూడు నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. మరో రెండు గోదాముల నిర్మాణం చేపట్టాల్సి ఉందని చెప్పారు. నిర్మాణం పూర్తి అయిన గోదాములను ఆయా సొసైటీలకు అప్పగిస్తామన్నారు. 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఆయా ప్రాంతాల్లో స్థల సేకరణ జరిగిందని చెప్పారు. నాబార్డు మంజూరు చేసిన నిధులను సొసైటీలు వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రూరల్ బ్యాంక్ మాజీ కార్యదర్శి జీవీ. సూర్యనారాయణమూర్తి(బాబు), కాంట్రాక్టర్ యరగోగు పాండురంగారావు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్.

ఆకివీడు: నిత్యావసర వస్తువులు ధరలు నింగికి అంటాయని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక జవహర్ పేటలో మంగళ వారం మహాసభ జరిగింది. ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు ఆర్.సత్యనారాయణ, సీతారామ్ ఏచూరిలకు నివాళులర్పించారు. సభలో ఆయన మాట్లాడుతూ గత మూడు నెలల్లో 20 నుండి 40 శాతం మేర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయాని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వంటనూనెలు, పప్పుధాన్యాలు, కూరగాయల ధరలకు రెక్కలొచ్చి ఆకాశానంటాయని ఎద్దేవా చేశారు. ధరల నియంత్రణను కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేశారు. తాళ్లకోడులోని పేదల ఇళ్ల కాలనీలో కనీస వసతులు కల్పించాని బలరామ్ విజ్ఞప్తి చేశారు. తాళ్లకోడును ఆకివీడు నగర పంచాయతీలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగే సీపీఎం సంస్థాగత మహాసభల్ని జయప్రదం చేయాలని బలరామ్ పిలుపునిచ్చారు. పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, డోకల రవితేజ, ఎస్.సూరిబాబు, బీవీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి


భీమవరం ఏఆర్‌కేఆర్ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ నాగరాజు

భీమవరం: పోలీసుల విధినిర్వహణపై విద్యార్థులకు అవగాహన అవసరమని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం నాగరాజు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు సమాజంలో పోలీసుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించే కార్యక్రమాల్లో భాగంగా వారిత్యాగాలను మననం చేసుకుంటూ పోలీస్ శాఖ విధులను తెలియజేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోటీలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్, స్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, మానవతా సంస్థ భీమవరం మండల శాఖ కోశాధికారి గ్రంధి కుమార్ వరప్రసాద్, స్మైన్ కార్పొరేట్ నర్సింహమూర్తి (బాబు), ఇందుకూరి శివాజీవర్మ, అరసవల్లి మణికంఠ వెంకటేష్, చింతాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలో నూతన భవన నిర్మాణాలు, పునర్నిర్మాణాలు చేపట్టే యజమానులు తప్పనిసరిగా నగర పంచాయతీ టౌన్ ప్లాన్ అనుమతి పొందాలని టౌన్ ప్లానింగ్ అధికారి రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికారికంగా భవన నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని, చట్ట ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష లేక భారీ జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. అనధికార భవన నిర్మాణం చేసిన వారికి మంచినీరు, డ్రెయినేజీ సౌకర్యం, విద్యుత్ సదుపాయాలు నిలిపివేస్తామని, అనధికార నిర్మాణదారుల వద్ద నుంచి ఏటా వసూలు చేసే ఆస్తి పన్ను రెండు ఇంతలు పెంచుతామని స్పష్టం చేశారు.

ఫైర్‌స్టేషన్‌కు ఆర్వో వాటర్ ప్లాంట్ బహూకరణ


భీమవరం ఫైర్‌స్టేషన్‌కు ఆర్వో వాటర్ ప్లాంట్ అందిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వ కార్యాలయాల్లో వసతులు ఏర్పాటుకు ప్రభుత్వంతో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారాలు అందించడం అభినందనీయమని భీమవరం ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్య ప్రకాషరావు అన్నారు. భీమవరం ఫైర్ స్టేషన్‌కు దాతల సహకారంతో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఫైర్‌స్టేషన్ సిబ్బందికి మంచినీటి సౌకర్యం లేదనే విషయం మా దృష్టికి రావడంతో అరసవల్లి సుబ్రమణ్యం ట్రస్ట్ ద్వారా కొండ్రు శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో ఆర్వోవాటర్ ప్లాంట్ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి సుబ్రమణ్యం, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా పటిష్ట చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నవంబర్ 2 నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాసం పూజల్లో భాగంగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని నరసాపురం ఆర్‌డీఓ దాసి రాజు వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. మంగళవారం స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకూ కార్తీకమాసం పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు భక్తులు, సేవా సంస్థల సభ్యులు, మీడియా సభ్యులు వివరించిన పలు సమస్యలపై ఆర్‌డీఓ దాసి రాజు మాట్లాడుతూ ఆలయంలో సర్వ దర్శనం, ప్రత్యేక దర్శనం ఏర్పాట్లలో భక్తులకు తొక్కిసలాట లేకుండా క్యూలైన్లు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు కార్తీక దీపాలు ఆలయం లోపల ప్రాకార మండపంలో కాకుండా ప్రాకార మండపం బయట వెలిగించుకునేలా దేవాలయం, పోలీసు, ఫైర్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లో భక్తులకు తాగునీరు, చలివేంద్రం వంటివి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పంచారామ యాత్రికులు రాత్రి సమయాల్లో పడుకోవడానికి పట్టణంలో ఉన్న దేవదాయ ధర్మాదాయ శాఖకు సంబంధించిన సత్రాలను ఏర్పాటు చేయాలనే అంశంపై చర్చిస్తామని అన్నారు. పట్టణంలో మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయానికి వచ్చే పంచారామ యాత్రికులు, స్థానిక భక్తుల వాహనాలు పార్కింగ్ కోసం సంత మార్కెట్ రోడ్డు, మార్కెటింగ్ యార్డు ప్రాంగణం, ద్విచక్ర వాహనాలకు బొండాడ కళాక్షేత్రం సెల్లార్‌లను పార్కింగ్‌గా ఏర్పాటు చేయాలన్నారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ కార్తీకమాసంలో ఆలయానికి వచ్చే భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి, ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


దొడ్డనపూడి గ్రామంలో వృద్ధుడికి బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు సునీల్

కాళ్ల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సరాబు సునీల్ స్పష్టం చేశారు. మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో 104 ద్వారా గ్రామస్తులకు సేవలు అందించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యాంపులో వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను చేశారు. అదేవిధంగా గ్రామంలో పర్యటి పాఠశాలలు సందర్శించి విద్యార్థులను పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు తెలిపారు.

విద్యార్థులు నూతన విద్యా విధానాన్ని మెరుగుపర్చుకోవాలి


భీమవరం సీఎస్ఎన్ కళాశాలలో మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ శ్రీనివాసరావు

భీమవరం: విద్యా విధానంలో ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీ పెరుగుతుందని మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు విద్యావిధానాన్ని మెరుగు పర్చుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ వై.శ్రీనివాసరావు అన్నారు. భీమవరంలోని సీఎస్ఎన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మంగళవారం మార్గదర్శన్ స్కీమ్‌ను శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన వర్క్ షాప్‌లో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ భవిష్యత్ అందించే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. మార్గదర్శన్ సభ్యుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మార్గదర్శన్ స్కీమ్‌తో ఎన్నో ఉపయోగాలున్నాయని దీనికోసం జిల్లాలో 5 కళాశాలను ఎంపిక చేయగా వాటిలో భీమవరం పట్టణంలోని సీఎస్ఎన్ కళాశాల, విష్ణు కళాశాల, డీఎన్నార్ కళాశాల లున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ చీడే సత్యనారయణ, ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, ట్రెజరర్ వడుపు గోపి తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి


వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసాపురం: వంటగ్యాస్ వినియోగం విషయంలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని గోదావరి గ్యాస్ (భారత్ గ్యాస్ ఏజన్సీస్) నరసాపురం శాఖ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గ్యాస్ వినియోగం విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వంట గ్యాస్‌ను పొదుపు చేస్తూనే మరోవైపు వినియోగించే సమయంలో ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్యాస్‌కు నాణ్యత ఉన్న సంరక్షణ ట్యూబ్‌నే వినియోగించాలని చెప్పారు. ఐదేళ్లకు ఒకసారి ట్యూబ్‌ను మార్చాలని చెప్పారు. రాత్రి వేళల్లో కచ్చితంగా రెగ్యులేటర్‌ను కట్టేయాలని సూచించారు. గ్యాస్ లీకైనప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై డెమో నిర్వహించారు. కార్యక్రమంలో మెకానికర్స్ పి.శ్రీనివాస్, కె.సురేష్, ఎస్.శివ పాల్గొన్నారు.

అపరిశుభ్ర పరిస్థితులను ఆన్‌లైన్ చేయాలి


దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అపరిశుభ్ర పరిస్థితులను ఆరోగ్య సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని అప్పారావుపేట, వెంకట్రావుపాలెం గ్రామాల్లో వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ కీటక జనీత ప్రదేశాలను నిలువరించడం ద్వారా దోమల నుంచి వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. అనుమానిత జ్వర కేసులకు ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ కాంతారావు పాల్గొన్నారు.

కొమరాడలో భూ రీసర్వే

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని కొమరాడ గ్రామంలో మంగళవారం భూ రీ సర్వే నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ రావి రాంబాబు పాల్గొని భూ సమస్యలు పరిష్కారానికి భూ రీ సర్వే ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

భీమవరం: చినఅమిరానికి చెందిన ఎస్ కావ్య వెంకట సాయి విజయను అదనపు కట్నం తీసుకు రమ్మని భర్త కోటిమల్లేశ్వరరావు, అత్తమామలు, మరో నలుగురు వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు 2019లో వివాహమైందని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రెహమాన్ తెలిపారు.

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న కమిషనర్ ఎం.అంజయ్య

నరసాపురం: అధిక వర్షాలు, వాతావరణ మార్పులతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. మంగళవారం కమిషనర్ విష జ్వరాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు శానిటరీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో తన చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ మార్పులతో డెంగీ జ్వరాల ప్రమాదం పొంచిఉందని అన్నారు. ప్రజలు డెంగీ జ్వరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పరిశుభ్రత విషయంలో వారికి అవగాహన కల్పించాలని సూచించారు. జ్వరాల బారిన పడితే ఇంటివద్ద వైద్యం తీసుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని చెప్పారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, శానిటరీ మేస్త్రీలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసాపురం : ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారం, ప్రయాణికుల సూచనలు, సలహాల కోసం మంగళవారం నిర్వహించ తలపెట్టిన డయల్ యువర్ డీఎం కార్యక్రమం రద్దయ్యింది. తిరిగి ఈ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి విలేకరులకు చెప్పారు. ఉదయం 11 గంటలు నుంచి 12 గంటల వరకూ 99592 25486 నెంబర్‌కు సమస్యలపై ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఘనంగా ప్రపంచ గణాంక దినోత్సవం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఓ నాగమణి

పాలకొల్లు సెంట్రల్: దేశ సుస్థిరాభివృద్ధికి, ఆర్థిక పురోభివృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి గణాంకాలు ఎంతో అవసరమని వీరవాసరం మండల స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎస్ఓ) బి.నాగమణి అన్నారు. మంగళవారం స్థానిక ఛాంబర్ కళాశాలలో ప్రపంచ గణాంక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి విద్యార్థులతో మాట్లాడుతూ గణాంక శాస్త్రం చదివిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ ప్రాముఖ్యత ఇతివృత్తంలో ప్రతి సంవత్సరం స్టాటిస్టిక్స్ డే జరుపుకుంటామని అన్నారు. కార్యక్రమంలో స్టాటిస్టిక్స్ ఇన్‌చార్జ్ దీప్తి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.